# జానకితో జనాంతికం



కళాప్రపూర్ణ

దువ్వూరి వేంకట రమణ శాస్త్రి

మహానుభావులు ముళ్లపూడి వెంకట రమణ గారిని

సభక్తికంగా సంస్మరిస్తూ...

**– రాజాచంద్ర ఫౌండేషన్**

# జానకితో జనాంతికం



**482, శాంతినగర్**
**కె.టి.రోడ్, తిరుపతి–517 507**
ఫోన్ : 0877–2232888

# జానకితో జనాంతికం

(వాక్ చిత్రం)

## స్వీయ చరిత్ర

- దువ్వూరి వేంకట రమణ శాస్త్రి

ముఖచిత్రం : **బాపు**

ముద్రణ : **జనవరి 2012**

ప్రచురణ : **రాజాచంద్ర ఫౌండేషన్**
**తిరుపతి**

ముద్రణ : **సాయిబాండ్స్ ప్రింట్‌సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్**
**చెన్నై**

ధర : **150 రూపాయలు**

# మా మాట

మేము గతంలో ప్రచురించిన తుమ్మపూడి, సురపురం, అమ్మకి జేజే, నాన్నకి జేజే, గురువుకి జేజే పుస్తకాలకు మీరు అందించిన స్పందన, సహకారాలకు మా కృతజ్ఞతలు.

మా ఫౌండేషన్ నాలుగవ ముద్రణగా కళాప్రపూర్ణ శ్రీ దువ్వూరి వేంకట రమణ శాస్త్రి గారి స్వీయచరిత్ర, వారు ఆలిండియా రేడియోలో చేసిన వాక్ చిత్రం 'జానకితో జనాంతికం' కలిపి ప్రచురిస్తున్నాము. సర్వం తానే అయి వుండి వ్యాపించి వున్న స్వామి పాదాల వద్ద అమ్మవారు కూచుని అంతటా వున్న ఆయన వద్ద జనాంతికం ఎలా అన్నట్టు చిన్న నవ్వు నవ్వుతున్న బొమ్మ బాపుగారికెంత యిష్టమో – అంతే మురిపెంతో మేము ఈ చిత్రాన్ని ముఖచిత్రంగా ప్రచురించుకుంటున్నాము.

బాపు గారికి మా పాదాభివందనం.

ఈ పుస్తకాన్ని పునర్ముద్రణకి అనుమతి యిచ్చిన అభినవ ప్రచురణల సంపాదకుడు శ్రీసాకం నాగరాజ గారికి మా కృతజ్ఞతలు.

**జుజ్జవరపు చంద్రమౌళి**

**రాజా ఫౌండేషన్**



## రాజాచంద్ర

వేదాద్రి శిఖరాన వెలిగున్న జ్యోతి మినుకుమని కాసేపు కునికి పోయింది.
దేవ లోకము నుంచి దిగినట్టె గంగ వచ్చిన్న దారినే పట్టిమళ్లింది.
పంజరం దూరిన బంగారు పిట్ట తలుపు తీసే లోపే తర్లిపోయింది.
కాపురమొచ్చిన కన్ని పాపాయి ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయాడు.

# జానకితో జనాంతికం

**త**ల్లిగా జానకీ! మనం మాట్లాడుకుని చాలా రోజులైందమ్మా – అప్పుడప్పుడూ భద్రాచలం వస్తూనే ఉన్నాను. అయిదారు రోజులు ఆగుతూనే ఉన్నాను. అమ్మని పలకరించడానికి అవకాశమే కనబడదు. వచ్చే జనానికి అంతూ పొంతూ లేదాయె. వచ్చిన వాళ్లు తమకి కావాల్సిందేదో ఆయనతో మాట్లాడుకుని వెళ్తారేమో అంటే ఆయన పిలిస్తే పలకడాయెను… పలుకే బంగారమట! అంత ఇదేమిటో? పలక్కపోతే మన అదృష్టం ఇంతే అనుకుని పోనీ ఆ వచ్చినవాళ్లు తిరిగి పోతారా…. ఊహూ. పక్కన నువ్వున్నావుగా జాలిపడే తల్లివి. 'సీతమ్మ తల్లీ! నీవైనా చెప్పవమ్మా' అని కొందరు, 'విభునికి మా మాట వినిపించవమ్మా' అని కొందరు కూనిరాగాలు తీస్తూ నీ చుట్టూ మూగుతారు. నీకీ సిఫార్సులతోనే సరిపోతుంది. ఎప్పుడూ ఇదే మేళం. ఇంక నీ దగ్గర కూచునేదెప్పుడు?

వాళ్లందర్నీ తప్పించుకుని ఎదరికి వద్దామా అనుకుంటూ ఉంటాను. రావచ్చుగానీ, పాపం వాళ్లంతా ఎక్కడెక్కడి నించో ఎన్నెన్నో కోరికలతో వస్తారనీ, వాళ్లకి అడ్డొస్తే బాధపడతారనీ ఎప్పటికప్పుడే వెనక్కి తగ్గుతుంటాను. మొన్నటి తఫాఅట్లాగే ఉండుండి వెళ్లిపోయాను. వెళ్లిపోయానన్న మాటేగానీ, మనసంతా ఇక్కడే ఉంది. ఎలాగా మళ్లీ రాదల్చుకున్నాను. కనుక, ఆ వచ్చేది కల్యాణానికే వద్దామనిపించి ఈ సమయానికి వచ్చాను. యాత్రీకుల హడావిడి అంతా అయ్యేదాకా ఆగాను. కల్యాణం ఇది వరకు చూశాననుకో, ఎన్నిసార్లు చూసినా చూడవలసిందేగా అది. ఏవంటావా? ఎంతమంది కవలేదు పెళ్లిళ్లు? పార్వతీ పరిణయాలూ, రుక్మిణీ కల్యాణాలూ, జాంబవతీ పరిణయాలూ… ఎన్నో వందలు, వేలు ఉన్నాయి. ఉంటే? అవన్నీ పుస్తకాల్లో ఉండేవే. ఇట్లా మహావైభవంగా ఇన్నివేలు, లక్షలు జనం కలసి ఏటేటా ముచ్చటగా చేసుకునేది సీతాకల్యాణం ఒక్కటేనమ్మా! ఉంది దాన్లో ఏదో విశేషం. విశేషం అంటే లోకమంతా అనుకునే విశేషం. ఒక్క సంగతి చూడు – నీ వివాహం అయిన తరువాత లోకంలో ఎన్నో కోట్లు అద్భుతంగా అయ్యాయి కదా పెళ్లిళ్లు. ఇన్ని పెళ్లిళ్లకీ వేసే శుభలేఖల్లో ఓ మంగళ శ్లోకం వేస్తూ ఉంటారు. ఎప్పుడైనా చూశావా? చూసి ఉండవ్. ఏ ధన్యాత్ముడు రాశాడో, ఏనాడు రాశాడో చెప్పలేం గానీ మా మంచి శ్లోకం.

**"జానక్యా కమలామలాంజలిపుటే యా పద్మరాగాయితాః**
**న్యస్తాః రాఘవ మస్తకేచ విలసత్ కున్ద ప్రసూనాయితాః**
**స్రస్తాః శ్యామల కాయకాన్తి కలితాః యా ఇంద్రనీలాయితాః**
**ముక్తాస్సా శ్శుభదా భవంతు భవతాం శ్రీరామ వైవాహికాః ॥"**

అనే ఈ శ్లోకం ప్రతి శుభలేఖలోనూ కనబడక తప్పదు. లోకంలో ఇన్నిసార్లు అచ్చుపడ్డ శ్లోకం మరొకటి లేదనుకో. ఏమి శ్లోకం? మీ కల్యాణ మాంగల్య శోభంతా ఈ శ్లోకంలో ప్రతిఫలిస్తుంటుంది. బిడియ పడుతూ, సంబర పడుతూ ఎంత ముచ్చటగా తలంబ్రాలు పోశావమ్మా!

ఈ కల్యాణ సమయంలో శ్రీరాముని శిరస్సు మీద నువ్వుంచిన ఆ ముత్యాల తలంబ్రాలు తమకు శుభం కలిగించాలని ప్రతి వివాహంలోనూ మీ కల్యాణం మాట తలచుకుంటూ ఉంటారు. ఔనుగాని – అమ్మా! మొన్న కల్యాణం చూసేటప్పుడు ఓ సందేహం కలిగింది. తలంబ్రాల సమయంలో ఆ ముత్యాలు నీ దోసిట్లో ఉన్నంతసేపూ ఎర్రగానూ, దోసిట్లోంచి విడిచినప్పుడు తెల్లగానూ, ఆయన వంటిమీద జారిపోతూ ఉన్నప్పుడు నల్లగానూ – ఇలా రంగు రంగులుగా కనబడ్డట్లు ఆ శ్లోకంలో ఉంది. కానీ రాముడు పోసినవి ఎట్లా ఉన్నాయో వాటి మాటే లేదు. దూరాన్నుంచి చూస్తుంటే తలంబ్రాలు ఎంతసేపూ నువ్వు పొయ్యడమే గాని ఆయనేమీ పోసినట్టు కనబడలేదు. మీ రోజుల్లో మగవాళ్లు పోసే అలవాటే లేదా? లేకుండా ఉండదు. ఠీవికి లోపమనో, బిడియ పడో ఊరుకుని ఉంటాడు. అపుడు పదిమందిలోనూ ఎందువల్లో తలంబ్రాలు పొయ్యకపోయినా – లోకం అందరికీ తెలిసేలాగా కొసకి పొయ్యదలచుకున్న వేవో పోశాడుగా నీ నెత్తిన – ఏం మనిషి? "స్నేహం దయాంచసౌఖ్యంచ యదివా జానకీమపి ఆరాధనాయ లోకస్య ముంచతో నాస్తి మే వ్యథా" – లోకారాధనం కోసం జానకినైనా విడిచి పెట్టేస్తాడట! ఇదా లోకారాధనం?

పోనీ – పంపేటప్పుడు నీతో ఇలాటి చిక్కొచ్చింది, తప్పింది కాదు, ఏమీ బాధపడకు – అని ఓదార్చి అయినా పంపాడా – అది లేకపోగా – 'ముని భార్యల్ని చూస్తానన్నావు కదా – చూసిరా!' అని మాయ మాటలు చెప్పి మరీ పంపేశాడు. నువ్వు అమాయకు రాలివి. పాపం అదంతా నిజమే అనుకుని ముని భార్యలకిద్దామని అన్ని ముతక చీరలు – అప్పటికప్పుడు నీకెట్లా అమిరాయో గాని ఎంత మూట రథం మీద పెట్టించావు తల్లీ! లక్ష్మణుడు గంగను దాటించి, ఆ శుభవార్త కాస్తా నీ చెవిన వేయగానే ఆ మూట మూటా మెల్లగా గంగలోకి దొర్లించేసి ఉంటావ్. నాకా మూటే జ్ఞాపకం వస్తూ ఉంటుంది. ఎంత ఆశాభంగం? అన్నగారు "నిను కానల లోపల దించి రమ్మనెన్" అని లక్ష్మణుడు చెప్పగానే ఆ పిడుగు లాంటి ఘోర వార్త విని నిండు చూలాలివి ఎలా భరించావో? ఈ పని చేయడానికి నేనే దొరికానా? 'నన్ను ఏల భూనాయకుడిట్టి బెట్టిది మొనర్పగ పొమ్మనె.....' అని పాపం లక్ష్మణుడూ దుఃఖపడ్డాడు. లక్ష్మణుడేమిటి, లోకమంతా ఈనాటికీ దుఃఖపడుతున్నాం. ఆ దుఃఖంలో రాముణ్ణి ఎవరైనా ఏదైనా పల్లెత్తు మాట అనబోయామంటే కళ్లెర్ర జేస్తావు. నీతో అదో బాధ, అంత దుఃఖంలో ఉన్నపుడు కూడా ఆ గంగ ఒడ్డున ఏమన్నావూ – "నా సంగతి పూర్తిగా ఎరిగి ఉండి కూడా ఎవరో తెలియని వాళ్లు నన్ను నింద వేసినయంత మాత్రమునకే అధిపుడులికి ఇంత తెగువ సేయనిచ్చగించుట నా యభాగ్యము ఇంతే, ఒకరి పల్కనేల" అన్నావు గాని పరుషంగా ఒక్కమాట నీ నోటంట రానివ్వలేదే. అదే నీలో ఉన్న గొప్పతనం. మేం అట్టా ఊరుకోలేం. ఊరుకోలేక పోయినా ఆ చాటున, ఈ చాటున అనుకోటమే గాని ఆయన ముఖమందు మేమూ అనలేం సుమా! ఇలా చనువు కనుక సంకోచం లేకుండా నీతో అంటున్నాను. ఆయనతో ఎప్పుడేనా అనేవు సుమా... కొంపదీసి... ఒకదానికొకటి... అదలా ఉంచుగాని – అమ్మా! నిన్ను విడిచి లక్ష్మణుడు వెనక్కి వెళ్లిపోయాక, అరణ్య మధ్యంలో దిక్కులేక నువ్వు వెక్కి వెక్కి ఏడుస్తుంటే ఎవరి వల్లో విని, వాల్మీకి నీ దగ్గరికే వచ్చాడు కదా! వస్తే అతని చరణమ్ముల చెంగట వ్రాలావట! పాదాల మీద పడలేదట. ఏమీ? తాకటానికి సంకోచమా? పిచ్చి తల్లీ! తాకితే ఏమీ ఆ మహానుభావుణ్ణి? నీతండ్రి జనకుడిని తాకవా? ఇదీ అంతే. అయితే తాను ఫలానా అని చెప్పేదాకా ఆయనెవరో నీకు తెలీదేమో? తెలిసినా జాగరూకతా, నీ మోతాదు, నీ స్థాయి, నీ మర్యాద అవన్నీ వేరేలే! దానికేం గానీ, నువ్వు పాదాలకి దగ్గరగా పడ్డప్పుడు వాల్మీకి "నన్నున్ మిథిలాధినాథువలె నీ చిత్తంబులో నెంచుమా!" అన్నాట్ట కదూ! మా కంకంటి పాపరాజు విన్నాట్ట ఆ మాట. మంచి విలువైన మాట. ఒక్క మాటతో ఎంత ధైర్యం కలిగించాడు! తండ్రికి స్నేహితుడై నందుకు తగిన ఆదరణ చూపించాడు. అదెప్పటికీ మర్చిపోలేం. సరేగానీ తల్లీ చూడూ, కొట్టకొసని... అయోధ్యలో యజ్ఞవాటికలో– "ఈ పాడులోకంలో ఇంక నేనుండలేను!" అని మీ తల్లి ఒళ్లో కూర్చుని భూగర్భంలో కెళ్లిపోయావే – ఆ సమయంలో నీ కొడుకులు కుశలవులు పసివాళ్ళు కదా, ఆ సభలోనే ఏ మూలో ఉంటారని నీకు తెలుసుకదా – వాళ్లని కూడా నీతో తీసుకెళ్లాలని గానీ, లేదా వాళ్లనొక్కసారి కళ్లారా చూసి వెళ్లాలనిగానీ, ఆ దృష్టి కొంచెమైనా నీకు కలిగినట్టు కనబడదే! మనసెట్టా ఒప్పిందీ! కన్నకడుపు కదా ఆ మాత్రం తోచకుండా ఉంటుందా. అందులోనూ నీకు. కాని అది మరీ కంగారు సమయం. అప్పట్లో వాళ్లమాట నీకు జ్ఞాపకం వచ్చి ఉండదు. అప్పుడు రాకపోయినా ఆ తర్వాత్తర్వాత వాళ్లెక్కడున్నారో, ఎట్లా ఉన్నారో అని అనుకోకుండా ఉండవు. వాళ్ల సంగతి ఏమైందో ఈ దేశంలో వార్తలు నీకు తెలిసీ ఉండవు.

## కొద్దిగా నే చెబుతా విను.

నువ్వెళ్లిపోయిన తర్వాత రాముడు అయోధ్యలో అట్టే కాలం ఉండలేదు. కొద్ది కాలానికే సరయూ ప్రవేశం చేసి వైకుంఠానికి వెళ్ళిపోయాడు. ఒక్కడే కాదు, అయోధ్యలో ఉన్న ప్రజలంతా ఆయనతోనే వెళ్లిపోయారు. విడిచిపెట్టగలరా మరి! ఏదో దుర్విధి వల్ల ఒక్క నీ విషయంలో తబ్బిబ్బులొచ్చాయి గానీ, సరయూ ప్రవేశానికి ముందే నీ కుమారులిద్దరికీ చెరోచోటా పట్టాభిషేకం చేసి, రాజ్యాలు అప్పగించాడు. వాళ్లిద్దరూ మీ ఇక్ష్వాకు వంశంలో పూర్వీకులందరికన్నా చాలా ప్రజారంజకంగా పరిపాలన చేశారు. గొప్ప కీర్తి సంపాదించారు.

అందులోనూ అమ్మా! ఆ పెద్దవాడున్నాడే కుశుడు. అతని సంగతి మరీ లోకోత్తరం. తండ్రిని మించిపోయాడు.

ఒక్క విశేషం చెబుతా విను. రాముడితోబాటు అందరూ సరయూ ప్రవేశం చేశాక అయోధ్యలో మనిషన్నవాడు లేక పట్టణమంతా పాడుబడిపోయిందట. పోదా మరి? నేను అని నడుం కట్టుకుని పట్టణానికి, మునుపటి ఔన్నత్యము, ప్రాముఖ్యము, సౌందర్యము నిలబెట్టే నాథుడు లేకపోయాడట. అప్పుడూ రాముడి అనంతరం 'నేను' అనవలసినవాడు కుశమహారాజు కదా అని ఆలోచించి అయోధ్యాపుర దేవత అతనితో తన కష్టాలు చెప్పుకుందామని ఓరోజు రాత్రి వెళ్లిందట. కుశుడు రాజభవనంలో తాను పరుండే గదిలో నిద్రపోతున్నాడట. మధ్యన మెలకువ వచ్చిందట. కళ్లు విప్పి చూశాడు. ఎదురుగా ఒక స్త్రీ కనబడిందట. యువతి... లోకోత్తర సౌందర్యవతి! ఎవరా అని తుళ్లిపడి లేచి కూర్చుని "కాత్వం శుభే కస్య పరిగ్రహోవా కింవామ! తవాభ్యాగమ కారణం? ఆచక్ష్వమత్వా వశినాం రఘూనాం మనః పరస్త్రీ విముఖః ప్రవృత్తిః" అన్నాట్ట. నాకెట్టా తెలిసిందంటావా? కాళిదాసు చెప్పాడు. అతడు ఇలాంటి సూక్ష్మాలు కనిపెట్టడంలో అసాధ్యుడులే. కుశుడేమన్నాడో విన్నావు కదూ. "ఎవరమ్మా నీవు ఎవరి భార్యవు? నా దగ్గరకు వచ్చిన పనేమిటి? తొందర పడుతూ సమాధానం చెప్పకు. ఒక్క సంగతి – ఇక్ష్వాకువంశపు రాజుల ప్రవర్తన ఎప్పుడూ పర స్త్రీ విముఖం అనే మాట మనసులో పెట్టుకుని మరీ జవాబు చెప్పు!" అన్నాడు.

విన్నావా? ఎంత నిగ్రహం? ఎంత ధైర్యం? ఎంత ఠీవి? అరెరె...! ఈ అంశంలో మాత్రం కుశుడు దగ్గర రాముడు ఎందుకూ చాలడమ్మా. అహహా.... అనకు... నే చెప్పేదంతా పూర్తిగా విను.

మీరు... పర్ణశాలలో ఉండగా రాముడు కోసం వచ్చింది కదూ శూర్పణఖ. తనను పెళ్లిచేసుకోమని అడిగింది కదూ? తరువాత అతను నిరాకరించాడనుకో – అది గొప్పే. అదట్లా ఉంచు. అసలు అడగనిచ్చాడా లేదా? స్వేచ్ఛగా అడగడానికి ఆమెకి అవకాశమిచ్చి ఔననీ కాదనీ కొంతసేపు ఆమెతో వాదోపవాదాలు నడిపించి, చివరికి తప్పించుకున్నాడనుకో, అసలు అంత దూరం రానివ్వచ్చునా అని? మరి నీ కొడుకు ఏం చేశాడో చూడు... "ఓయ్ ఎవరు నువ్వు? ఇది పడకటిల్లు. పైవాళ్లు రాదగ్గచోటు కాదు. ఆడదానవు. పైగా అర్ధరాత్రివేళ వచ్చావు. కంగారుగా కనబడుతున్నావు. అనుమానంగా ఉంది. ఎందుకో వచ్చావా... నాతో మాట్లాడకు. నోరు విప్పకు. మామూలు పనేదైనా ఉంటే చెప్పు!" అని మొదటే నోరు కట్టేశాడు. ముందు అనుచితమైన మాట అడిగించుకోటానికి ఒప్పుకుని, తర్వాత నిరాకరించడం గొప్పో, అసలు అడిగించుకోడానికే ఇష్టపడక పోవడం గొప్పో ఆలోచించు. అంతా ఇంతా అంతరమా. హస్తిమశకాంతరం! నువ్వు నూరు చెప్పు. వెయ్యి చెప్పు. ఈ విషయంలో మాత్రం కొడుక్కి తండ్రి బాగా తీసికట్టు మనో నిగ్రహంలోనూ, ఏకపత్నీవ్రత దీక్షలోనూ రాముడు దగ్గర నించోటానికి ఎవరికీ అర్హత లేదు. అది ప్రపంచమంతా అంగీకరించిన పరమ సత్యం. కానీ ఆ పరనారీ పరాన్ముఖతా పరాకాష్ఠను పాటించడంలో నీ పెద్దకొడుకు దగ్గర మాత్రం రాముడు నించోలేడు. ఎట్లాగో బిగబట్టి నుంచున్నా కాళ్లు మాత్రం వణక్క తప్పదు. కొడుక్కీ తండ్రికీ అంత అంతరం ఉంది. ఆ తారతమ్యానికి కారణమూ ఉంది. అవతారమైనా, కౌసల్యా దశరథులలోంచి వచ్చిన అవతారం అది – సీతారాముల్లోంచి వచ్చిన అవతారం ఇది. తేడా లేదు మరీ? సరి – ఏదో కాస్సేపు కష్టం సుఖం మాటాడుకున్నాం. అమ్మ దగ్గర ఎంత సేపైనా కూచోవాలనే ఉంటుంది. అయినా చాదస్తంగా ఆలస్యం చేయ కూడదు. నీ కోసం చాలా మంది కనిపెట్టుకుని ఉంటారు. ఎప్పుడైనా మళ్లీ కూర్చుందాం. వస్తూనే ఉంటానుగా. ఏమిటమ్మా ఏదో అంటున్నావూ – కొంచెం గట్టిగా చెప్పు... ఓహో అదా...! నేను భద్రాచలం రావడం మళ్లీ ఎప్పుడంటావా? వస్తాను. మా జానకమ్మ తల్లి మళ్లీ ఎప్పుడు తలుచుకుంటుందో అప్పుడు.

కళాప్రపూర్ణ

# దువ్వూరి వేంకటరమణ శాస్త్రి

## స్వీయ చరిత్ర



# రమణీయమూర్తి

**పూ**చెను కలువలు; తోచెను చుక్కలు; నెగడెను తమములు – ఈ వాక్యాలు 'బాలవ్యాకరణం'లోని ఒక సంధి సూత్రానికి వరుసగా ఇచ్చిన ఉదాహరణలు. ఇవి అన్నీ కలిస్తే ఒక సాయంకాలానంతర సన్నివేశాన్ని గుర్తుకు తెస్తున్నాయని – ఇక్కడ 'గ్రామర్'కి భిన్నంగా ఒక 'మూడ్'ని చూపించిన వ్యాకరణ సాహితీ సహృదయులు మా తాతగారు కీ॥శే॥ శ్రీ దువ్వూరి వేంకటరమణశాస్త్రిగారు. రమణీయ గ్రంథ రచయితగా సహృదయ పండితులందరికీ సుపరిచితులు. తెలుగుభాష తెలిసిన వారందరికీ 'బాలవ్యాకరణ' మన్న పేరు తెలిసే ఉంటుంది. ఆ బాలవ్యాకరణానికి 'సాహితీసౌరభా'న్ని అద్దిన సౌందర్య భావుకులు వీరు. వీరి పేరుని చేర్చుకుంటూ, 'సుందరమైనది' అన్న అర్థం స్ఫురించేటట్టు ఈ గ్రంథానికి పేరు పెట్టడంలోనే వీరి 'హృదయధర్మం' మనకు అర్థమవుతోంది. కటువైన శాస్త్రాన్ని అతి సుకుమారమైన 'పుష్పం'గా మలచడం వీరు సాధించిన విద్య. అలాగే సంక్లిష్టమైన మానవ జీవితాన్ని సరళతరం చేసుకున్న సాధనాపరులు. ఈ సాధనలో వీరు చేతబూనిన జీవనసూత్రాలు స్నేహధర్మమూ సౌందర్యభావనా అని వీరి జీవితచరిత్ర మనకు చెప్తోంది.

నా చిన్నతనంలో 'కార్తీకపౌర్ణమి' రోజున దీపాల ఉత్సవం జరిగినపుడు తెల్లటి అరటి దొప్పలపై, గులాబీపూలను కూర్చి పూలకు వేడి సోకనివ్వకుండా మధ్యలో ఒత్తిని వెలిగించి నీటి ప్రవాహంలో వదిలేవారు. అందరూ వెళ్ళిపోయినా ఆ దీపం ఆవలి గట్టుకు చేరేవరకు, వెన్నెలలో ఆ దీప సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ ఎంతోసేపు ఆ ఏటిగట్టున ఉండడం నాకింకా గుర్తు ఉంది. అందరి ఇళ్ళముందు సంక్రాంతి నెలరోజులే ముగ్గులుండేవి. కానీ మా ఇంటిముందు – ఒక సర్కిల్ ఆకారంలో పచ్చటి గడ్డిని ఒక పద్ధతిలో పెంచి మధ్యలో ఖాళీ ఉంచి, అక్కడ తెల్లటి పిండి కలిపిన ముగ్గుతో – మా నాగమణి (మా అక్క) నిలబెట్టిన చిలకలో–హంసలో–నెమళ్లో–365 రోజులూ ఉండేవి. ఇదంతా తాతగారి అభిరుచి!

ఆయన గదిలో – ఆకుపచ్చరంగు చీరతో – ఎర్రటి పెద్ద బొట్టుతో ఉన్న జిల్లేళ్ళమూడి 'అమ్మ' ఫోటో చుట్టూ మందారపూలు ఉంచి వాటిపై నక్షత్రాల్లాంటి నందివర్ధనం పూలను శ్రద్ధగా అమర్చేవారు. ఈ రంగుల కలయికలో ఆయన చూపే శ్రద్ధ చూసేవారి మనసులకు ఎంతో హాయిని, ప్రశాంతతను చేకూర్చేది! మా ఇంట్లో దండాలపై ఆరే బట్టలనుండి – నేలపై ఎండబెట్టే ధాన్యాలవరకు ఒక చక్కని అమరికతో నేత్రపర్వంగా ఉండాలని పట్టుబట్టి ఇంటిని అలా తీర్చిదిద్దేవారు. ఆ ఇల్లు ఒక చిత్రకారుని వివిధవర్ణాల సమ్మేళనంలా ఉండేది! ఆ రోజుల్లో పండితులెవరూ బాహ్యస్వరూపానికి, వేషధారణకూ ప్రాముఖ్యమిచ్చేవారు కాదు. కానీ, తాతగారు ఎప్పుడూ మల్లెపూవులాంటి పంచతో, చక్కని ఒక ప్రత్యేకమైన తిలకధారణతో, ముక్కుపొడుం పీల్చిన ఆనవాలు తెలియని నల్లరంగు చేతిరుమాలుతో 'రమణీయమూర్తి'గానే ఉండేవారు. వీరి ఈ సౌందర్యాన్ని ఆస్వాదించే మనోధర్మమే భాషానియమాల్ని మాత్రమే చెప్పే వ్యాకరణాంశాల్లో, రమణీయతను చూడడానికి అవకాశమేర్పరచింది.

అలాగే – వీరు గ్రంథంలో కఠినంగా ఖండించవలసిన సందర్భాలలో కూడా మృదుమధురంగా ఇతరులతో విభేదించిన తీరు – వీరి సహజలక్షణమైన స్నేహదృక్పథాన్ని సూచిస్తుంది. ఎంతోమంది స్నేహితుల స్నేహసౌరభంతో మా ఇల్లు గుభాళించిపోతూ ఉండేది. వివిధ రాష్ట్రాల నుండి అనేకులు తాతగారికి స్నేహితులుగా ఉండేవారు. భాష, సంప్రదాయం – ఆచారం వేరువేరైనా వీరందరి మధ్యా ఉండే ఆంతరంగిక సంబంధం ఆశ్చర్యాన్ని కలిగించేది. వీరి జీవనయానంలో సగభాగం స్నేహితుల ఇళ్ళలోనూ, మిగిలిన సగభాగం తన ఇంట్లో స్నేహితులతోనూ గడిచిపోయేది.

ఇవన్నీ నేను ప్రత్యక్షంగా చూసిన సన్నివేశాలు. కానీ వీరు అక్షరాలతో మలచిన జీవనచిత్రంలో నాకు తెలియని ఎన్నో సంగతులు, వారి విద్యోపార్జన, ఆడుతూ, పాడుతూ చదువుకుంటున్నా చెరగని దీక్ష! నేటికాలం తల్లిదండ్రులకు విద్యార్థులకూ కూడా ఒక పాఠం! వారు అధ్యాపకులుగా స్థిరపడ్డాక శిష్యులతోడి సంబంధం! ఆ శిష్యులకు వీరితో పెనవేసుకున్న ప్రేమానుబంధం ఆ వృత్తిలోనే ఉన్న నాకూ, నాలాంటి వారికీ ఒక దీపస్తంభం!

జీవితాన్ని సింహావలోకనం చేసుకుంటూ తాతగారు వ్రాసిన మాటలు! గురుసంపద - శిష్యసంపద, మిత్రసంపద నాకు జీవితంలో లభించిన పెన్నిధులు అన్నారు. దీన్ని చూస్తే మనం జీవితంలో సంపాదించుకోవలసిన ఆస్తి ఏమిటో తెలుస్తుంది. దాదాపు 20 మంది మనుమలు వారికి ఉన్నారు. అందరూ కూడా, జీవితాన్ని జుర్రేసుకోవాలన్న అత్యాశ ఆరాటం లేకుండా, ఏలోటునీ ఫీలవకుండా సంతృప్తిగా జీవితాన్ని కొనసాగిస్తున్నారంటే - ఆయన వారసత్వంగా మాకిచ్చిన ఈ తృప్తి అనే సంపదే కారణం!

ఈ పుస్తకం చదవిన వారందరికీ కూడా జీవితాన్ని ఎంత సౌందర్యవంతంగా మలుచుకోవచ్చో తెలుస్తుంది! మనకున్న వాక్చమత్కృతితో-చాతుర్యంతో ఇతరులకు హాని కలిగించకుండా మన కర్తవ్యాన్ని ఎలా నిర్వర్తించవచ్చో నేర్పుతుంది. ముఖ్యంగా ఆ కాలం నాటి వారి విద్యావ్యాసంగం, వారు నిలబెట్టుకున్న విలువలు, వారి జీవితంలోని ప్రాథమ్యాలు, నేటితరం వారికి తెలియవలసిన అవసరం ఎంతైనా ఉంది! నాకు పూర్తిగా కళ్ళు విప్పార్చి లోకం చూసే వయసు రాకుండానే, నా 21వ యేట తాతగారు మమ్మల్ని వదలి వెళ్ళిపోయారు. ఆ లోటు తీరనిది. కానీ వారి ఈ జీవితచరిత్ర కొంతవరకు తోడు! మళ్ళీ ఈ పుస్తకాన్ని ప్రజల మధ్యకు తెస్తున్న శ్రీ జె. చంద్రమౌళిగారు - వారి అన్నగారు జె.రాజరత్నంగారి తనయులు శ్రీ దుర్గాప్రసాద్‌గారు మాకు నిత్యస్మరణీయులు.

**డాక్టర్ ధూళిపాళ అన్నపూర్ణ**
ఎం.ఏ., పిహెచ్.డి.
రీడర్
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల
సీతంపేట, రాజమండ్రి

**కార్తీక పౌర్ణమి**
**సాయం సమయాన**

ఓం

# ఉపక్రమం

అప్పుడప్పుడు ఎవరెవరివో స్వీయ చరిత్రలూ ఆత్మ కథలు చదువుతుంటే మన జీవితంలోని ఘట్టాలు కూడ జ్ఞాపకం ఉన్నంత మటుకు ఒక డయరీగా వ్రాదామా అనిపిస్తుండేది. ఆదర్శప్రాయంగా ఉండే పెద్దల జీవిత చరిత్రలు లోకానికి ఉపయోగంగాని మనలాంటి సామాన్యుల జీవితాలకు వ్రాతలెందుకు అని మళ్ళీ తోస్తూండేది. పోని లోకానికి ఉపయోగం లేకపోయినా మన మటుకు మనం ఈ జీవితానికి ఎందుకొచ్చామో ఎప్పుడొచ్చామో ఎక్కడున్నామో ఏవి చూశామో ఏమి చేశామో ఏమి చెప్పామో ఏమి విన్నామో ఏమి తెలిసిందో ఎంత తెలిసిందో అని సింహావలోకనంగా ఒక్కసారి జీవితం వంక వెనక్కి తిరిగి చూచుకుంటే మనమటుక్కైనా తృప్తికరమైన ఘట్టాలు కొన్నైనా కనబడితే మన జాతకం కూడా రవంత మంచిదే యని సంతోషిద్దాం. ఏమి కనబడకపోతే "నధ్యాతం పదమీశ్వరస్య విధివత్ సంసార విచ్ఛిత్తయే స్వర్గ ద్వారకవాట పాటనపటుః ధర్మోసినో పార్జిత" అని జీవితాంతంలో నిర్వేదపడ్డ కొందరు పూర్వులతో పాటు మనం కూడా పశ్చాత్తాప పడదాం. అదీ కొంత మంచిదే గదా అని వ్రాయడానికే గట్టిగా నిశ్చయించుకొన్నాను.

తప్పకుండా వ్రాదామన్న నిర్ణయం తేలినప్పుడు 70 ఏళ్ళు దాటిన ఈ వయసులో ఇంక ఆట్టే ఆలస్యం చేయకుండా ఆరంభించడమే మంచిదని కూడా తోస్తుండేది. నా సంకల్పాన్ని ఎలాగో పరంపరయా విని ఎవరెవరో సన్నిహితులైన ఆప్తులు కలసినప్పుడు మీరు మీ జీవితచర్య త్వరలో వ్రాయాలండీ అంటూండే వారు. కొందరు ఛాత్రులు "జీవితచర్య వ్రాయడం ఇంక ఆరంభించడం తప్పదు మాష్టరు గారు" అని నిర్బంధంగా ఉత్తరాలు వ్రాస్తూ ఉండేవారు. ఇవన్నీ తలలో కలసి ఇక తప్పక వ్రాదామన్న నిశ్చయం మనస్సులో ఏర్పడింది. వ్రాత మొదలు పెట్టడం ఈవేళా రేపా అనుకొంటూంటే; చిన్నదేగాని నామటుకు పెద్దదిగా గోచ రించిన ఒక సమస్య స్ఫురించింది. స్ఫురించడమేకాదు ఎదురుకుంది. ఏమిటంటే ఈ జీవిత చర్య వ్రాయడం గ్రాంధిక భాషలోనా వ్యావహారిక భాషలోనా అని.

ఇదని ఒకరోజూ అదని ఒకరోజూ ఆలోచన మారుతూ ఉండేది. చిరకాలం వ్రాఁతలో అలవాటై తెలుఁగులోనే గాకా చీఁకట్లో కూడా కనబడుతూ వీఁపు తడుము కుంటూ చేతికి తగులుతూ ఆఁకలిలో కూడా మరపురాని అరసున్నలన్నిటినీ విడిచి పెట్టడమేనా అనిపిస్తూండేది.

ఇలా వారం పది రోజులు గడిచిపోయాయి. తరువాత ఇది మన జీవిత రంగంలో జరిగిన ఘట్టాలు జ్ఞాపకం తెచ్చుకొని సమీక్షించుకోడానికి వ్రాసుకునే డయరీ మాదిరిదే గాని ఒక కావ్యమా కాదు. ఒక లక్షణ గ్రంథమా కాదు. పిల్లలకు పాఠ్యపుస్తకంగా ఉద్దేశించిందా కాదు. ఒక విమర్శ గ్రంథమా కాదు. ఏ గ్రంథమైనా పదికాలాలపాటు ఉండవలసేదైతే భిన్నభిన్న భాషా వ్యవహారం గల పది మండలాల్లో తిరగవలసేదైతే ఇప్పటి వారికేగాక భావికాలపు వారికీ, ఈ జిల్లా వారికేగాక దూరప్రాంతాల వారికి సులభంగా తెలిసేటట్టు ఆంధ్రదేశం అంతకూ ఏకరూపమైన గ్రాంధిక భాషలో ఉండడం అవసరంగాని అలాటిదికాక మన మటుకు మనం ఒక్కసారి సింహావలోకనంగా సమీక్షించు కోడానికి, సన్నిహితులైన ఆప్తులు, ఆత్మీయులూ ఎవరైనా పదిమంది చూడడానికి మాత్రమే, ఉద్దేశించి వ్రాసుకునే ఈ డయిరీలో గ్రాంధికభాష ఎందుకు? గ్రాంధిక వ్యావహారికాల్లో ఏది ఎక్కడ ఉచితమో దాన్ని అక్కడ ఉపయోగించుకోవడం సరసంగాని పిడుక్కీ బియ్యానికీ ఒకటే మంత్రం అనుకోవడం మంచిది కాదు. దేని మంత్రం దానిది.

వెనకటికెవరో ఒకాయన ముష్టివాణ్ణి పొమ్మనడానికి "ఓయి బిచ్చగాడా! తండులంబులిచ్చు వారిచ్చట నెవ్వరుం గానరారు ఎచ్చటికేని చెచ్చెర విచ్చేయుము" అనేవారట.

ఆ పద్ధతి చాదస్తాన్ని వికారాన్ని సూచిస్తుందిగాని గ్రాంధిక భాషానురక్తిని వెల్లడించదు. స్థానాస్థాన వివేచన అంతటా అవసరం. దేని చోటు దానికివ్వాలి.

అదలా వుండగా జీవితంలో ఇంచుమించు యాభై ఏళ్లపాటు గ్రాంధిక భాషలోనే పుస్తకాలు చదివేము. చదివించేము. ఏవేవో వ్రాసిన మటుకు గ్రాంధిక భాషలోనే వ్రాసేము, వ్రాయించాం. పట్టుమని పది పేజీలు వ్యవహార భాషలో ఎప్పుడూ వ్రాయలేదు. వ్రాతలో అలవాటులేని ఆ భాషలో మనం వ్రాయగలమో లేమో! గ్రాంధిక వ్యావహారిక సాంకర్యం లేకుండా కేవలం వ్యావహారికంలో వ్రాయడం మనకు కుదురుతుందో కుదరదో అని.

ఒకసారి ఆత్మపరీక్ష కూడా చేసుకొన్నట్లవుతుంది. కనుక వ్యావహారిక భాషలోనే వ్రాద్దాం అని కొసకు మనస్సులో ఒక నిర్ణయం తేలింది. దాన్నిబట్టి వ్యావహార భాషలోనే వ్రాయడం ఆరంభిస్తున్నాను. జీవితం మొత్తంలో వయసు పెరిగిన కొద్దీ జరిగిన చర్యల కంటె బాల్యంలో జరిగిన చర్యలే ఎక్కువ వివరాలతో నాకు జ్ఞప్తిలో ఉన్నాయి. ఎవరికేనా అంతే కాబోలు! అందుకే “నవభాజనలగ్నంబగు సంస్కారంబు పొలియదు” అన్నారు సూరిగారు నీతి చంద్రిక పీఠికలో. ఆయనన్న ప్రతిమాట ముత్యాల మూట.

8, 9 ఏళ్ళ నా వయస్సు నాకు తెలుసు. అప్పటికి మేము పెద్దాపురం తాలూకాలో జగ్గంపేట అనే ఊళ్ళో ఉండే వాళ్ళం. మా తండ్రిగారు ఆ ఊళ్ళో స్కూలు మాస్టరుగా ఉండేవారు. ఆయనిది అసాధారణ మయిన స్వతంత్ర పద్ధతి. ఎవ్వరికీ లొంగే స్వభావం కాదు. తన పని తాను చక్కగా, సక్రమంగా ఏ లోపం లేకుండా నెరవేర్చుకొని అధికారులు ఏమాటా అనడానికి వీలు కలక్కుండా ఎప్పటి కప్పుడు తగిన జాగ్రత్తలో ఉండడం ఆయన కలవాటు. ఆ ధైర్యం వల్లే ఒకరి లక్ష్యం మనకేమిటి అనే తత్వం క్రమంగా ఆయనలో బలపడి ఉండవచ్చు. అప్పటి స్కూళ్ళ ఇనస్పెక్టర్లకు ఆ తత్వం నచ్చలేదు. తక్కిన మేస్టర్లలాగ ఇతను మన దగ్గిర కొచ్చి చేతులు నలపడే! ఆశ్రయించడే! అని ఆ అధికార్లకు గుఱ్ఱు ఏర్పడింది. ఆ గుఱ్ఱువల్లే ఏవేమో మిషలు కల్పించి మా స్వగ్రామం మసకపల్లికి మూడు తాలూకాలు దాటించి పనిష్మెంటుగా పెద్దాపురం తాలూకాలో వేశారు. వేశారన్న మాటేగాని ఆయన అది పనిష్మెంటుగా భావించనే లేదు. ఆ ఊళ్ళో మహోల్లాసంతో ఉండేవారు. మొత్తం 7-8 ఏళ్ళున్నారు. అక్కడ అందరూ స్నేహితులే. అంతా ఆప్తులే, అందరూ ఆత్మీయులే, కొత్త చోటయినా అలాంటి అనుబంధం ఏర్పడింది. ఆ గ్రామస్థుల్లో చాలామంది మీద ఈయనదే పెత్తనం. మాటకు ఎంతో చెల్లుబడి.

ఊళ్లో అందరితోనూ ఎంత కలిసికట్టు తనం ఉండేదో ఇంట్లో అంత ముభావం. ఇంట్లో ఎవ్వరితోనూ మాట్లాడే అలవాటే లేదు. అదో వింతైన స్వభావం మాకందరికీ పెద్దపులిని చూస్తున్నట్లుండేది. ముఖంలో క్రూరత ఉందేమో అంటే సౌమ్యమయిన ముఖం ఎత్తైన విగ్రహం. పచ్చగా కోమలంగా ఉండే శరీరం. అతి శుభ్రంగా ఉండే అలవాటు. మంచి ఆరోగ్యం. ఎంతో చురుకుదనం. ఎప్పుడూ ఉల్లాసమే. చింతా చీకూ ఉండేదికాదు. ఆయన నవ్వులో ఒక విలక్షణమైన అందం ఉండేది. ఆమాట చాలామంది అంటూండేవారు. పై వాళ్ళతో మాట్లాడే టప్పుడు ఆ నవ్వు చూడాలని నేను ముచ్చటపడే వాణ్ణి. ఇంట్లో నవ్వు కనబడేదే కాదు. పోనీ మామీద ప్రేమ లేదనుకుందామా అంటే అమితమైన ప్రేమ. ఎందుకుండదు? నేను ఒక్కణ్ణే కుమారుణ్ణి. అయితే అంత ముభావం ఏమిటంటే; చనువిస్తే ఇంట్లో వాళ్ళకీ పిల్లలకీ భయభక్తులుండవని తెచ్చి పెట్టుకున్న గాంభీర్యం గాని ఇంట్లో ఎవరి మీదా కోపమూ కాదు. అయిష్టమూ కాదు. అదో రకం ప్రకృతి.

సరీగా చెప్పాలంటే; ఆయన జీవితం మొత్తంలో నాలుగు నిమిషాలు వరసగా నాతో మాట్లాడిన జ్ఞాపకం లేదు. ఒకటి రెండు నిమిషాలు మాత్రం మాట్లాడిన సందర్భాలు కొన్ని జ్ఞాపకం ఉన్నాయి. చాలా కొద్ది. అవయినా ఎప్పుడు? నాకు పదహారేళ్లు దాటిన తరువాత. ఇంకొక్క మాట, నాకు రెండు మూడేళ్ళ వయస్సులో కూడా నన్ను ఒక్కసారయినా ఎత్తుకున్నట్లుగాని ఎప్పుడయినా దగ్గిర పరుండబెట్టుకున్నట్లు గాని చూచిన వారెవ్వరూ లేరు. ఆ అలవాటు అసలే లేనట్లు మా తల్లిగారి వల్లే విన్నాను.

ఇంట్లో నలుగురు పెద్దవాళ్లు ఉండేవారు. 1. తాతగారు (తండ్రి తండ్రి), 2. నాయనమ్మ, 3. అమ్మమ్మ, 4. తల్లి. వీరందరికీ ఆయన్ని చూస్తే గడగడే. అదోరకం డిసిప్లిను. అది ఏకొంతో మోతాదుగా ప్రతి గృహస్థుకీ అసలు ఉండడం మంచిదేగాని మరీ యెక్కువయితే కష్టం. ఊళ్ళో అందరితోనూ అంత ఆప్యాయనంగా ఆయిలా బాయిలాగా మాట్లాడుతారే మనతో కూడా అలా మాట్లాడితే బాగుండునని నాకు అదే ఒక కోరికగా ఉండేది. ఇంచుమించు ఆ కోరిక (పితృ సల్లాప వాంఛ) ఆయన జీవితకాలంలో అనగా నాకు ఇరవై యేళ్ళ వయస్సు వరకూ పూర్తిగా తీరనే లేదని చెప్పవచ్చు. నన్ను గూర్చి వాత్సల్యంతో, ఉత్సాహంగా పరులతో చేస్తున్న ప్రసంగాలు వాళ్ళవల్ల విని సంతోష పడేవాణ్ణి. పసితనం మొదలు నా యిరవైయేళ్ళ వయస్సు దాకా నాకు అవసరమయిన వినోద వస్తువులో, బట్టలో, పుస్తకాలో, కాగితాలో, కలాలో, డబ్బో - ఏవి యే వయస్సులో నాకు ఎంతెంత అవసరమో అవన్నీ యింట్లో ఎవరూ చెప్పకుండానే సిద్ధం చేయడంలో ఆయనకి శ్రద్ధ ఇంతా అంతా కాదు. లోపల ఉన్నది వాత్సల్యం. పైకి కనబడేది తాటస్థ్యం. ఆ తత్వం చిన్నప్పుడే గ్రహించాను.

మరేమీ కాదుగాని, తండ్రికి మరింత సన్నిహితంగా ఉండి ఇంకా కొంత ఆనందం పొందే అవకాశం మనకు లేకపోయిందే అని మాత్రం అప్పుడప్పుడు ఇప్పటికీ అనుకుంటూంటాను. అంతేగాని ఆయనవల్ల ఆ యిరవై యేళ్లూ కలిగింది నిరుత్సాహమే అని మాత్రం అనుకోవడం లేదు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2127**

* * *